నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, గురువారం 23 జనవరి 2025 | MEDAK




సిద్దిపేట:గాడిచెర్లపల్లి సభలో రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే హరీశ్‌రావుకు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు



గజ్వేల్: అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేయాలని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో అధికారులతో గొడవకు దిగుతున్న గ్రామస్తులు



సిద్దిపేట జిల్లాకేంద్రంలోని 15వ వార్డు గాడిచర్లపల్లిలో నిర్వహించిన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో తమ సమస్యలపై ఏకరువు పెడుతున్న గ్రామస్తులు

## కేసీఆర్ పాలనే నయముండే

- కాంగ్రెస్ సర్కారు దగా చేస్తున్నది..
- మమ్మల్ని మోసం చేస్తున్నది..
- హరీశ్‌రావు ఎదుట గోడు వెల్లబోసుకున్న అన్నదాతలు
- కేసీఆర్‌ను గుర్తుచేసుకున్న జనం

సిద్దిపేట, జనవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ గవర్నమెంట్ ఉన్నప్పుడే నయముండే సార్, అప్పుడు పింఛన్లు, రైతుబంధు, అన్ని పథకాలు సక్కగ అమలైనయి సార్, కాంగ్రెస్ సర్కారు అచ్చిన నుంచి మాకు అంతా అన్యాయం జరుగుతున్నది సార్ అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎదుట గాడిచర్లపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని 15వ వార్డు గాడిచర్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన సభలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను ఆయన విన్నారు. అందరికీ రుణమాఫీ చేయలేదని, రైతుభరోసా రావడం లేదని, అర్హులకు రేషన్ కార్డులు రావడం లేదని, ఇందిరమ్మ ఇండ్లు రావడం లేదని, ఇప్పటికే చాలాసార్లు దరఖాస్తు పెట్టుకున్నా మళ్లీ పెట్టుమంటున్నారని ప్రజలు హరీశ్‌రావుకు గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నదని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఒక్క హామీ అమలు కావడం లేదని, రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని విమర్శించారు. రైతుబంధు వేయాలని డిమాండ్ చేశారు.పంట రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. కోతలు, ఎగవేతలు, అసమర్థ పాలన తప్ప రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రజాపాలనలో రుణమాఫీ కాలేదని గాడిచెర్లపల్లిలోనే అనేక మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

### ఏడాదిలో మమ్మల్ని ఆగంజేసిండ్రు..



తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతాలేడు కాని.. ఢిల్లీకి పోయి హామీలను ఇస్తున్నాడు రేవంత్ రెడ్డి. తెలంగాణ ఇచ్చుడు చేతకాదు కాని ఢిల్లీకి వెళ్లీ హామీలను ఇస్తున్నాడు. కాంగ్రెస్ ఇస్తానన్న రైతుభరోసా, రుణమాఫీ, రేషన్‌కార్డులు ఏవి. సీఎం దసరాకు రుణమాఫీ అన్నడు. అది కాలేదు. ఏడాది పాలనలో కాంగ్రెసోళ్లు ప్రజలను ఆగంజేసిండ్రు. నాకు రూ.42 వేల రుణమాఫీ కాలేదు. సీఎం ఏమో అందరికీ రూ. రెండు లక్షలు మాఫీ చేసినా అని చెప్పవట్టే. రైతు బంధు ఎగ్గొట్టిండ్రు.

– గాడిచెర్లపల్లి సభలో రైతు నర్సింగరావు

### ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టాలే..



ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టినం. కానీ, పేరు రాలేదు. అడిగినప్పుడల్లా దరఖాస్తు చేసుకోమంటున్నారు. ఇప్పుడు మళ్లీ దరఖాస్తులు చేయమంటే ఎట్లా. దరఖాస్తులకు పైసలు పెట్టుడు తప్ప లిస్ట్‌లో పేరు రావడం లేదు. మా సమయం ఖరాబు చేస్తున్నరు. దరఖాస్తులు పెట్టుడు ఉంది తప్ప పథకాలు మాత్రం రావడం లేదు.

– జహీరొద్దీన్, 15వ వార్డు సిద్దిపేట

### రూ.16 వేల మిత్తి కట్టిన



నాకు రుణమాఫీ కాలేదు. కానీ, ఉల్టా రూ.16 వేల మిత్తి కట్టిన. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు. మూడు విడుతలు చూసినా నాపేరు జాబితాలో రాలేదు. నాకు రూ.1.60 లక్షల పంట రుణం ఉంది. కానీ మాఫీ కాలేదు. కాంగ్రెస్ సర్కారు గిట్ల మమ్మల్ని మోసం చేయడం తగదు.

– ఉడుత బాలయ్య, రైతు, గాడిచెర్లపల్లి

### నాకు రుణమాఫీ కాలేదు..



నాకు ఇప్పటి వరకు ఒక్క విడుత కూడా రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే మాకు తెలువదు అంటుండ్రు. నాకు రూ.1.34 లక్షల పంట రుణం ఉంది.మూడు విడుతలుగా నాపేరు రాలేదు. డిసెంబర్ నెలలో మిత్తి కట్టి రెన్యువల్ చేసుకున్న. అయినా నా లోన్ మాఫీ చేయలేదు. బ్యాంక్ అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు అంటున్నారు. రైతుభరోసా ఇంకెప్పుడు ఇస్తారు. రెండు పంటల పైసలు వేయలేదు. రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ సర్కారు మమ్మల్ని దగా చేస్తున్నది.

–కొమ్ము యాదయ్య, రైతు, గాడిచెర్లపల్లి

### చీకట్లో ఈ తిప్పలేల..



సిద్దిపేటలోని గాడిచెర్లపల్లి 15వ వార్డులో బుధవారం ప్రజాపాలన సభ నిర్వహించారు. వార్డు ప్రజల నుంచి వార్డు కార్యాలయంలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దరఖాస్తులు స్వీకరించడానికి అధికారులు ఇబ్బంది పడ్డారు. దరఖాస్తుదారులు సెల్‌ఫోన్‌లో టార్చ్ ఆన్‌చేయగా, ఆ వెలుతురులో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 22

## పింఛన్ ఇప్పించండమ్మా..

- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న వృద్ధ దంపతులు



పింఛన్ ఇప్పించాలంటూ కలెక్టర్ వల్లూరు క్రాంతికి మొరపెట్టుకుంటున్న వృద్ధ దంపతులు

చౌటకూర్, జనవరి 22: తమకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని చౌటకూర్ మండలం బద్రిగూడెంలో బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. వివరాలు.. బుధవారం బద్రిగూడెంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్‌ను ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన చిలిపిచెట్టి అలివేలమ్మ, రాములు దంపతులు కలిశారు. తమ ఒక్కగానొక్క కుమారుడు ఇరవై ఏండ్ల క్రితం చనిపోయాడని, తమకు ఎలాంటి ఆధారం లేదని, భిక్షంతో జీవిస్తున్నామని , పింఛన్ మంజూరు చేయలని వేడుకున్నారు. బద్రిగూడెం గ్రామానికి కలెక్టర్ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న వృద్ధ దంపతులు, గ్రామస్తుల సహాయంతో ఉప్పరిగూడెం నుంచి బద్రిగూడెం చేరుకున్నారు. అప్పటికే గ్రామసభ ముగియడంతో కలెక్టర్ తన వాహనంలో ఎక్కారు. దీంతో వృద్ధ దంపతులు చిలిపిచెట్టి అలివేలమ్మ, రాములు వాహనానికి ఎదురుగా వెళ్లి మొరపెట్టుకున్నారు. తాము దుర్భర జీవితాన్ని గడుపుతున్నామని, పింఛన్ రావడం లేదంటూ వేడుకోగా, వాహనంలోంచి కిందకు దిగిన కలెక్టర్ అక్కడే ఉన్న ఆర్డీవో పాండుతో మాట్లాడారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే వృద్ధ దంపతుల్లో ఒకరికి పింఛన్ మంజూరు చేసేందుకు ఫైల్ పెట్టాలని ఆదేశించారు.

# ప్రజాగ్రహం

## రెండోరోజూ గ్రామసభల్లో లొల్లిలొల్లి..



సిద్దిపేట అర్బన్: అనర్హులను పథకాలకు ఎంపిక చేశారని మిట్టపల్లిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.. నిరసనలు
- జాబితాలను ఏ ప్రాతిపదికన సిద్ధం చేశారని, గత దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నల వర్షం
- కాంగ్రెసోళ్లకే పథకాలు కేటాయిస్తారా అని జనం ఆక్రోశం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడికక్కడ అధికారుల నిలదీత
- మద్దూరు మండలం నర్సాయపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నేతలు

సిద్దిపేట, జనవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నది ఒకటి గ్రామాల్లో జరుగుతున్నది మరొకటి. ప్రభుత్వ పనితీరుపై గ్రామసభలో నిరసనల హోరు కొనసాగుతున్నది. రెండోరోజూ బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రభుత్వ తీరును ప్రజలు తీవ్రంగా ఎండగట్టారు. గ్రామసభల్లో ప్రజలు లొల్లిలొల్లి చేశారు. నిరసనలు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంక్షేమ పథకాల జాబితాలను ఏ ప్రతిపాదికన సిద్ధం చేశారని ప్రశ్నించారు. రేషన్ కార్డుల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టాలి? ఇందిరమ్మ ఇండ్లకు కోసం ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి.. అంటూ అధికారులను నిలదీశారు. వివిధ సంక్షేమ పథకాల కోసం గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల గ్రామసభలను ప్రజలు బహిష్కరించారు. మరికొన్నిచోట్ల అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ కార్యకర్తలకేనా సంక్షేమ పథకాలు? ఇదేం ప్రభుత్వం అంటూ గ్రామసభల్లో ప్రజల తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. ఎన్నికల ముందు చెప్పింది ఏంటి? ఇప్పుడు చేస్తున్నది ఏంటి? అంటూ అధికారులను నిలదీశారు. మద్దూరు మండలం నర్సాయపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డారు. పోలీస్ బందోబస్తు మధ్య గ్రామసభలు తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపించారు.

- సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామసభలో లబ్ధిదారుల జాబితాను అధికారులు చదువుతున్న క్రమంలో వారంతా అనర్హులు అంటూ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎంత సర్దిచెప్పినా వినకపోవడంతో గ్రామసభను మధ్యలోనే ముగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేశారు. కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.
- నంగునూరు మండలం ఘణపూర్ గ్రామసభలో గొడవ జరిగింది. అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని ఆరోపించారు.
- నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామసభ పోలీస్ బందోబస్తు మధ్యన జరిగింది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల్లో అర్హుల పేర్లు లేవంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు.
- గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామసభలో ప్రారంభం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో 24గంటల కరెంట్ ఇదేనా..? అంటూ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. బయ్యారంలో గ్రామసభ ప్రారంభంతోనే అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు అంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు.
- మద్దూరు మండలం నర్సాయిపల్లి గ్రామసభ రసాభసగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవ జరిగింది.
- నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామసభ రసాభాస అయ్యింది. పంట బోనస్ డబ్బులు రాలేదని అధికారులను రైతులు నిలదీశారు.
- భూమి ఉన్నవారికే ఆత్మీయ భరోసా తయారు చేశారని నిరుపేదలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నిజాంపేట మండలం నస్కల్ బీటీ పనులు చేపట్టాలని గ్రామసభలో నిరసన తెలియజేసి గ్రామస్తులు బైఠాయించారు.
- కొల్చారం మండలం కొంగోడు గ్రామసభ రసాభసగా మారింది.
- శివ్వంపేట మండలం పాంబండలో అనర్హులను ఎంపిక చేశారని అధికారులను గ్రామస్తులు నిలదీశారు.
- చిలిపిచెడ్ మండలం జగ్గంపేటలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రొటోకాల్ వివాదంలో వాగ్వాదానికి దిగారు.
- కొడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు.
- నార్సింగి మండల కేంద్రంలో అర్హులకు పథకాలు రాలేదని గ్రామస్తులు ఆందోళన చేశారు.
- న్యాల్‌కల్ మండలం గంగ్వార్‌లో పంట నష్టపరిహారం రాలేదని అధికారులను నిలదీశారు. రెండు లక్షల రుణమాఫీ కాలేదని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు రాలేదని అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు.
- రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు గ్రామసభలో అధికారుల పనితీరుపై కాంగ్రెస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై మండిపడ్డారు. పటాన్‌చెరు పాశమైలారం, గుమ్మడిదల నల్లవల్లిలో నిరసనలు, నిలదీతలు జరిగాయి.
- నారాయణ్‌ఖేడ్ మండలం సత్య గ్రామసభలో ఆత్మీయ భరోసాకు అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంగ్టి మండలం బోర్గిలో అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామసభలో రైతుభరోసాపై అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు



గజ్వేల్: రేషన్ కార్డు జాబితాలో తమ పేర్లు లేవని బయ్యారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



చౌటకూర్: రైతుభరోసా రూ.15వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి, తీరా ఇప్పుడు రూ.12 వేలకు కుదించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బద్రిగూడెం గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు



చేగుంట: అర్హుల జాబితాలో తమ పేర్లు రాలేదని నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆందోళన చేస్తున్న మహిళలు



కొల్చారం: నాయిని జలాల్ పూర్‌లో ఇందిరమ్మ భరోసాకు ఎంపిక చేయకపోవడంతో అధికారులను ప్రశ్నిస్తున్న యువకుడు



రామాయంపేట: ఝాన్సీలింగాపూర్ గ్రామసభ రసాభసగా మారగా, గ్రామస్తులను సముదాయిస్తున్న ఎంపీడీవో షాజులుద్దీన్



శివ్వంపేట: కొంతాన్‌పల్లిలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని మండిపడుతున్న మహిళలు



చిన్నశంకరంపేట: సంక్షేమ పథకాలు అందడం లేదంటూ అంబాజీపేట గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## పదవులు కాదు..ప్రజల మనసు గెలవాలి

- మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 22: నిస్వార్థంగా సేవచేస్తే నాయకులు, ప్రజాప్రతినిధులను ప్రజలు వారి గుండెల్లో పెట్టుకుంటారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చివరి పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 26తో పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్నందున దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి , రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వనితారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సుగుణలతో పాటు కౌన్సిలర్‌లు, కోఆప్షన్ మెంబర్లు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయంలో దుబ్బాకను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకున్నట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మున్సిపల్‌కు మంజూరైన రూ.15 కోట్ల నిధులు వెనక్కి తీసుకోవడం బాధించిందని పేర్కొన్నారు. ఐదేండ్లు విజయవంతంగా ప్రజలకు సేవలు అందించినందుకు సంతోషంగా ఉందని పాలకవర్గం పేర్కొన్నది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు శాశ్వతం కాదని, మానవ సేవయే మాధవ సేవగా అలవరుకోవాలని పిలుపునిచ్చారు.దుబ్బాకను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా కృషిచేస్తామన్నారు. దుబ్బాక మున్సిపల్‌పై తిరిగి గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పాలకవర్గానికి జ్ఞాపికలతో సన్మానించారు.



దుబ్బాక మున్సిపల్‌లో పాలకవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

**విడిపోయి కలిసిన అన్నాచెల్లి**

దుబ్బాక మున్సిపల్ పాలకవర్గ చివరి సమావేశంలో మనసుకు హత్తుకునే సంఘటన ఒకటి చోటుచేసుకుంది. 2021లో దుబ్బాక మున్సిపల్‌లో జరిగిన తొలి ఎన్నికల్లో చెల్లాపూర్‌కు చెందిన 2వ వార్డు కౌన్సిలర్‌గా గొనేపల్లి దేవలక్ష్మి, 3వ వార్డు కౌన్సిలర్‌గా మట్ట మల్లారెడ్డి ఎన్నికయ్యారు. వీరిద్దరు సొంత అన్నాచెల్లెళ్లు. కౌన్సిలర్లుగా గెలిచిన సమయంలో వారు కలిసి మెలిసి ఉన్నారు. కొద్దిరోజుల తర్వాత రాజకీయాల కారణంగా ఇద్దరి మధ్య విబేధాలు వచ్చాయి. సోషల్ మీడియాలో సైతం పరస్పరం విమర్శలు చేసుకున్నారు. బుధవారం నిర్వహించిన చివరి సమావేశంలో చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, సహచర కౌన్సిలర్ల ప్రోద్బలంతో ఈ అన్నాచెల్లెలు కలిసిపోయారు. ఒకరినొకరు అక్కున చేర్చుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారిని పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది చప్పట్లతో అభినందించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం వారిని ప్రత్యేకంగా అభినందించారు. రాజకీయం శాశ్వతం కాదని, ప్రేమనురాగాలు ప్రధానమని సూచించారు.

## కూడవెల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

దుబ్బాక, జనవరి 22: కూడవెల్లి రామలింగేశ్వరాలయ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన దర్శించుకుని పూజలు చేశారు.ఈనెల 28 నుంచి మాఘ అమావ్యాస సందర్భంగా వారం పాటు జరిగే జాతర ఏర్పాట్లపై దేవాదాయ, పోలీసు అధికారులు, ఆలయ అర్చకులతో సమీక్షించారు. కూడవెల్లిలో స్నానాలు ఆచరించే భక్తులు ప్రమాదాల బారినపడందా రక్షణ చర్యలు చేపట్టాలని, గజ ఈతగాళ్లతో పాటు వాగుకు ఇరువైపులా వలలను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు నగరం రవి, కిషన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చింతల కృష్ణ తదితరులు ఉన్నారు. పోతారం గ్రామంలో బుధవారం సిద్దిపేట లోహిత్ సాయి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు లోహిత్ సాయి వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి విద్యార్థులకు స్టీల్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఆ తర్వాత దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో 131 మంది బాధితులకు రూ.30 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## కాలయాపనకే గ్రామసభలు

- కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

గుమ్మడిదల, జనవరి 22: ఆరుగ్యారెంటీలు, ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవడానికి కాంగ్రెస్ సర్కారు గ్రామసభల పేరిట కాలయాపన చేస్తున్నదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాగుమ్మడిదలలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జిల్లా యువత అధ్యక్షుడు జి.వెంకటేశంగౌడ్‌తో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం పాలనలో విఫలమైందనన్నారు. ఒక్క పథకం, గ్యారెంటీ సరిగ్గా అమలు కావడం లేదన్నారు. గ్రామసభల్లో ప్రజల నుంచి సర్కారుకు నిరసనలు, నిలదీతలు ఎదురవుతున్నాయని తెలిపారు. గతేడాది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు, ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసా పథకాలు ఇవ్వకుండా, కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే దక్కుతున్నాయని ఆరోపించారు. అనర్హులకు పథకాలు మంజూరు చేస్తూ అర్హులకు కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ఒక సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వాఖ్యలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయని తెలిపారు. సమావేశంలో నాయకులు చిమ్ముల దేవేందర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, తుపాకుల రాజు, ఆంజనేయులు యాదవ్, వాసుదేవారెడ్డి, అమ్మగారి సదానందరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నల్తూరి యాదగిరి, పెంటయ్య, శంకర్‌నాయీ ఉన్నారు.